ఖాళీ జాగా.. విషపురుగులు పాగా


హౌసింగ్ కార్యాలయ ప్రవేశ ద్వారంలో పేరుకున్న కంపచెట్లు


గిర్రాజుకాలనీలో ఇళ్ల చుట్టు పేరుకున్న ముళ్లపొదలు


శివరామ్‌నగర్‌లో ఇళ్ల పక్కనే కంపచెట్లు

- చిట్టడవులను తలపిస్తున్న స్థలాలు
- వీధుల్లోని మురుగునీరూ అక్కడే నిల్వ
- జంగిల్ క్లియరెన్స్‌పై అధికారుల నిర్లక్ష్యం

మున్సిపాలిటీ	ధర్మవరం
వార్డులు	40
ఖాళీ స్థలాలున్న వార్డులు	30

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఖాళీ స్థలాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. కంపచెట్లు, తిక్కచెట్లు ఏపుగా పెరిగిపోయి పాములు, తేళ్ల తదితర విషపురుగులకు ఆవాసంగా మారుతుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఖాళీ స్థలాలకు పన్నులు కట్టించుకునే మున్సిపల్ అధికారులు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ప్రధాన రహదారులు, వీధుల్లోకి వెళ్లే మట్టి రహదారుల వెంబడి ఉన్న ఖాళీ స్థలాల్లో కంపచెట్లు పెరగడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో చాలాచోట్ల స్థిరాస్తులు ఉన్నాయి. ఆయా ఖాళీ స్థలాలకు యజమానులు మున్సిపాలిటీకి పన్నులు కడుతూ మిన్నకుండిపోతున్నారు. ఖాళీ స్థలాలు ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, కంపచెట్లతో అపరిశుభ్రంగా ఉంటున్నాయి. దీంతో ఇక్కడ విషపురుగుల సంచారం పెరిగిపోతోంది. సమీపంలోని నివాసాల నుంచి మురుగునీరు సైతం ఈ ఖాళీ స్థలాల్లోకి వచ్చి చేరుతుండడంతో దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. 30 వార్డుల్లో ఖాళీ స్థలాలు ఉన్నాయి. ముఖ్యంగా సత్యసాయినగర్, దుర్గానగర్, రాజేంద్రనగర్, సుందరయ్యనగర్, మారుతినగర్, గిర్రాజుకాలనీ, హౌసింగ్ ఆఫీస్ వార్డు, రేగాటిపల్లి రోడ్డు, శివానగర్, శాంతినగర్, శారదానగర్, తిక్కస్వామి కొట్టాల, గీతానగర్, నంజయ్‌నగర్, కేశవనగర్ తదితర ప్రాంతాల్లోని వార్డుల్లో ముళ్ల పొదలు ఎక్కువగా దర్శనమిస్తున్నాయి.

జంగిల్ క్లియరెన్స్ ఎక్కడ?

ప్రైవేట్ ఖాళీ స్థలాల్లో ముళ్లపొదలు, కంపచెట్లు ఎక్కువగా ఉండటంతో వాటిని స్థల యజమానులు శుభ్రం చేయకపోతే మున్సిపల్ అధికారులు జంగిల్ క్లియరెన్స్ పెట్టి తొలగించాలి. కానీ మున్సిపల్ అధికారులు ఆ దిశగా పనులు చేయడంలేదు. దీంతో ఎప్పుడు ఏ విష పురుగులు ఇళ్లలోకి వస్తాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.


దుర్గానగర్‌లో ఇళ్ల ముందు...


సత్యసాయినగర్‌లో...

అధికారులు చొరవ చూపాలి

పట్టణంలోని చాలా వార్డుల్లోనున్న ఖాళీ స్థలాల్లో ముళ్లపొదలు, కంపచెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో అక్కడ విషపురుగులు చేరుతున్నాయి. సమీపంలోని ఇళ్లలోకి వెళ్తున్నాయి. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేయిస్తే ప్రజలను రక్షించినవారవుతారు.



– అజంతా కృష్ణ, ధర్మవరం

గణేశ్ ఉత్సవాలకు ముందస్తు ప్రణాళికలు

ప్రశాంతి నిలయం: రాబోయే గణేశ్ ఉత్సవాల నిర్వహణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో కదిరి ప్రాంతానికి చెందిన వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది రానున్న వినాయక చవితి వేడుకలు ప్రస్తుతం దేశంలో ఉన్న పరిస్థితులను గుర్తించి సామరస్యంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, ఆయా ప్రాంతాలలోని అధికారులు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. పోలీసు శాఖ గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, అనుమతులు ఇచ్చే ముందు అన్ని రకాల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయ సారథి, కదిరి ఆర్డీఓ శర్మ, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, కదిరి తహసీల్దార్ మురళీకృష్ణ, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరో జాబేగం, కదిరి వినాయక ఉత్సవ కమిటీ చైర్మన్ నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

బాల్య వివాహాలు అరికట్టాలి

పుట్టపర్తి అర్బన్/ తాడిమర్రి: బాల్య వివాహాలను అరికట్టే బాధ్యత మనందరిపైనా ఉందని పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ పేర్కొన్నారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద సీడీపీఓ గాయత్రితో కలసి ప్రచార ఆటోను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ సమాజానికి చీడ పురుగుల్లా తయారైన బాల్యవివాహాలు, సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మన వివరాలు, బ్యాంకు ఖాతాలు ఎంత గోప్యంగా ఉంటే అంత మంచిదన్నారు. ఎవరికి పడితే వారికి మన వివరాలు చెప్పరాదన్నారు. బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా తమ దృష్టికి తేవాలన్నారు. పిల్లల నడవడిక, ఆన్‌లైన్ గేమింగ్, మొబైల్ వాడకంపై జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీపీఓ మహేష్, కోఆర్డినేటర్ కొడప్ప, పీఓ నాగలక్ష్మి, సోషల్ వర్కర్లు ఆనంద్, జగదీష్, మనిదీప్, సురేంద్ర, సుస్మిత, వాల్మీకి సేవా సంఘం సెక్రెటరీ వీరనారప్ప తదితరులు ఉన్నారు.


పుట్టపర్తిలో జెండా ఊపి ప్రచార ఆటోను ప్రారంభిస్తున్న ఆర్డీఓ సువర్ణ

- తాడిమర్రి మండలం ఎం.అగ్రహారం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోరి బాలికలకు గుడ్ టచ్– బ్యాడ్ టచ్‌పై సీడీపీఓ సరస్వతి అవగాహన కల్పించారు. బాలల హక్కులు, పోక్సో చట్టం గురించి వివరించారు.

భక్తిశ్రద్ధల నడుమ దేవతా ఉద్వాసన

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో పదోరోజు మంగళవారం దేవతా ఉద్వాసనను భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. ఆలయ అర్చకులు కోనేరాచార్యులు, మకరందబాబు, భానుప్రకాష్, చక్రధర్‌లు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. దేవతా ఉద్వాసన కార్యక్రమంలో భాగంగా బ్రహ్మోత్సవాలకు ఆశీనులైన బ్రహ్మ, పరమేశ్వరులు ఇంద్రాది అష్ట దిక్పాలకులకు తాంబూలాలతో సత్కరించి వారి యథా లోకాలకు సాగనంపడమే దేవతా ఉద్వాసన ముఖ్య ఉద్దేశమని అర్చకులు తెలిపారు. ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించిన అనంతరం గరుత్మంతుని చిత్రపటంతో దేవతలను సాగనంపారు. అనంతరం అన్నమయ్య సేవా మండలి సభ్యులు పొరాళ్ల పుల్లయ్య శిష్య బృందం ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి. బుధవారం పుష్పయాగం, శయనోత్సవంతో లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.


దేవతా ఉద్వాసన నిర్వహించిన దృశ్యం

అన్ని కేంద్రాల్లోనూ సంపద సృష్టించాలి

నల్లమాడ: జిల్లాలోని అన్ని చెత్త సంపద కేంద్రాల్లో సంపద సృష్టికి చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ అధికారులను జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) సమత ఆదేశించారు. నల్లమాడలోని చెత్త సంపద కేంద్రాన్ని మంగళవారం డీపీఓ సందర్శించారు. సంపద సృష్టికి తీసుకొంటున్న చర్యలను పంచాయితీ కార్యదర్శి విశ్వనాథరెడ్డి డీపీఓకు వివరించారు. ప్రతి మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వారపు సంత జరుగుతున్నందున అక్కడ నిలిచివుండే చెత్తను మరుసటి రోజు సంపద కేంద్రానికి తరలించాలని డీపీఓ సూచించారు. నల్లమాడ గ్రామ పంచాయితీలో 10 వేలకుపైగా జనాభా ఉన్నందున మరో ఆరుగురు క్లాప్ మిత్రలను నియమించుకోవాలని తెలిపారు. డీపీఓ వెంట డిప్యూటీ ఎంపీడీఓ అమర్నాథ్‌రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ దస్తగిరి ఉన్నారు.


చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ సమత

నిత్యావసర సరుకుల పంపిణీ

నల్లమాడ: దొన్నికోటలో సర్పంచ్ రాగినేని సరస్వతి, ఆమె భర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు నాగరాజు నాయుడు మంగళవారం ఆరుగురు పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తన తండ్రి రాగినేని పెద్ద రెడ్డెప్పనాయుడు ఆరో వర్ధంతి సందర్భంగా పంచాయతీ కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి, గ్రామ పెద్దలు ఆలంసాబ్ చేతుల మీదుగా పారిశుధ్య కార్మికులకు సరుకులు అందజేసినట్లు నాగరాజునాయుడు తెలిపారు. సచివాలయ సిబ్బంది నిరంజన్, గ్రామస్తులు రామక్రిష్ణనాయుడు, చిన్నరాం నాయుడు, శ్రీరాంనాయుడు పాల్గొన్నారు.


సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన

నల్లమాడ: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై వీధి నాటకం ద్వారా అవగాహన కల్పించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ ఎలా సోకుతుంది, సోకకుండా ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలిచ సుఖ వ్యాధులు, చికిత్స విధానం, కండోమ్ ఉపయోగాలు తదితర అంశాలపై ఎంఆర్‌డీ సరోజమ్మ కళాబృందం వీధి నాటకం ద్వారా వివరించింది. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ రాఘవేంద్ర, జన జాగృతి కదిరి ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు, ఏఓఆర్‌డబ్ల్యూ శ్రీవాణి, రమాదేవి, శిల్ప, శాంతమ్మ పాల్గొన్నారు.

సత్యసాయి విద్యాసంస్థల్లో వంద శాతం ఉత్తీర్ణత

ప్రశాంతి నిలయం: సీబీఎస్‌ఈ పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాల్లో సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. సత్యసాయి ప్రైమరీ పాఠశాలకు చెందిన టెన్త్ విద్యార్థులు 87 మంది, ఇంటర్మీడియెట్‌లో 111 మంది పరీక్షలు రాయగా ... అందరూ పాసయ్యారు. ఈశ్వరమ్మ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు 53 మంది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్మీడియెట్‌లో 42 మంది పరీక్షలు రాసి అందరూ పాసయ్యారని ప్రిన్సిపాల్ శివరామ కృష్ణయ్య తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ఓడీచెరువు : ఎంపీపీ తుమ్మల పర్వీన్‌భాను అధ్యక్షతన గురువారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ కోరారు

విద్యార్థిని అదృశ్యం

పుట్టపర్తి అర్బన్: ప్రశాంతిగ్రామ్‌కు చెందిన ఓ విద్యార్థిని అదృశ్యమైంది. ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన బాలిక ఈ నెల 11న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. తిరిగి రాలేదు. ఎన్నిచోట్ల వెదికినా జాడ కానరాకపోవడంతో తల్లిదండ్రులు పుట్టపర్తి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విద్యార్థిని ఆచూకీ తెలిస్తే 94407 96839కు సమాచారం తెలపాలని ఎస్‌ఐ లింగన్న కోరారు.

అన్నదానం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని తిక్కనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం సీనియర్ న్యాయవాది గుంటెప్ప పేదలు, అనాథలకు అన్నదానం చేశారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రతినెలా తిక్కనారాయణస్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్నామని న్యాయవాది తెలిపారు.

బదిలీ అధికారులకు సన్మానం

ఎన్పీకుంట: బదిలీ అయిన ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, డీఎల్‌పీఓ అంజినప్ప, ఉపాధి హామీ ఏపీఓ మంజులను మంగళవారం ఎంపీపీ ఈటె రాము ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పార్థసారథి, ఈఓపీఆర్డీ మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా కాలువ సామర్థ్యం పెంచాలి


రౌండ్‌టేబుల్‌లో పాల్గొన్న నాయకులు

కదిరి టౌన్: హంద్రీ-నీవా కాలువ సామర్థ్యం పెంచుతూ చివరి ఆయకట్టుకు నీరు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, ఏపీ రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఎన్జీవో హోంలో హంద్రీ-నీవా నీటి సాధనపై ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లం మహాదేవ్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. పదివేల క్యూసెక్కుల సామర్థ్యంతో హంద్రీ-నీవా కాలువ వెడల్పు చేసి, ఆరు లక్షల ఎకరాలకు సాగు నీరు అందించి, లైనింగ్ పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కమతం కాటమయ్య, పెద్దన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కదిరప్ప, నాయకులు అంజన్‌బాబు, సూర్యనారాయణరెడ్డి, పవన్, లియాకత్, రమణ, ఈశ్వరయ్య, రెడ్డయ్య, రైతులు, మహిళా సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాగు నీరందించాలి

హంద్రీ-నీవా కాలువ వెడల్పు చేసి ఉమ్మడి జిల్లాలో సాగునీరందించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, జీఎల్ నరసింహులు విలేకరులతో మాట్లాడారు. 35 సంవత్సరాల క్రితం కరువు సీమకు వరప్రదాయినిగా ప్రకటించిన హంద్రీ-నీవా ద్వారా ఉమ్మడి జిల్లాలో మూడున్నర లక్షల ఎకరాలకు సాగునీరందిస్తామని పాలకులు చెప్పారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కాలువ వెడల్పు చేసి, పిల్లకాలువలు ఏర్పాటు చేసి తద్వారా వ్యవసాయ భూములకు నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వి.వి.రమణ, శివన్న, సాంబశివ, రామ్మోహన్, బాబ్జాన్, ముస్తక్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

● తాగునీరు కలుషితం


కుళాయి ద్వారా వస్తున్న కలుషిత నీరు

నల్లచెరువు: మండల కేంద్రంలోని పంచాయతీ బోరు నుంచి వచ్చే తాగు నీరు కలుషితమవుతోంది. పంచాయతీ అధికారులు కె.పూలకుంటలోని చెరువులో బోరు వేసి అక్కడ నుంచి పైపులైను ద్వారా నల్లచెరువుకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. అయితే బోరు చెరువు మధ్యలో ఉండటం వల్ల నీరు కలుషితమై నలుపు రంగులోకి మారుతోంది. అదే నీరు కుళాయిల ద్వారా సరఫరా అవుతోంది. ఈ నీటిని ఇంటి అవసరాలకు కూడా వాడుకోలేని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి నరేష్ దృష్టికి తీసుకెళ్లగా హుటాహుటిన వాటర్ ట్యాంకు శుభ్రం చేయించారు. చెరువునీరు బోరులో చేరడం వల్ల కలుషితమవుతున్నట్లు గుర్తించామన్నారు.

క్లుప్తంగా

అన్నమయ్య చరితం... నృత్య రూపకం


నృత్య కళాకారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న అతిథులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సాంస్కృతిక మండలిలో అన్నమయ్య జయంతి ఉత్సవాల సందర్భంగా శ్రీ లలిత నాట్య కళానికేతన్ నాట్య గురువులు బాబు బాలాజీ, కమల బాలాజీ, రామలాలిత్యల నేతృత్వంలో 50 మంది శిష్య బృందం మంగళవారం 'అన్నమయ్య చరితం' అనే నృత్య రూపకాన్ని ప్రదర్శించింది. కోలాటం, నాట్యంతో ఆకట్టుకున్నారు. మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ అంబటి అరుణ, అంబటి సతీష్, సాంస్కృతిక మండలి వ్యవస్థాపకులు సత్రసాల ప్రసన్నకుమార్, సభ్యులు సోలిగాళ్ల వెంకటేష్, బీజేపీ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు హాజరై నృత్య కళాకారులకు సర్టిఫికెట్లు అందించారు.

సమ్మె జయప్రదం చేయండి


సమ్మె పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ఓడీచెరువు : ఈ నెల 20న తలపెట్టిన దేశ వ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన ఓడీచెరువులోని అంబేడ్కర్ సర్కిల్‌లో సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సమ్మె చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వి.వి.రమణ, రామ్‌రెడ్డి, మండల కార్యదర్శి కుళ్ళాయప్ప, ఆశీర్వాదమ్మ, బషీర్, రైతు సంఘం నాయకులు శ్రీనివాసులు, అంజినప్ప, భావన్న, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు

సీబీఎస్‌ఈ టెన్త్ ఫలితాల్లో 'జైన్' విద్యార్థుల సత్తా


భవిత / షగుఫా సుల్తానా / సారా కౌసర్

కదిరి అర్బన్: సీబీఎస్‌ఈ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో కదిరి జైన్ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. భవిత 462, షగుఫా సుల్తానా 454, సారా కౌసర్ 446, హర్షద్ 438 మార్కులు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

ముగిసిన ఏటి గంగమ్మ సంబరాలు

తలుపుల : మండల కేంద్రం ఎగువపేట సమీపంలో గల ఏటి గంగమ్మ ఆలయం వద్ద మొలకల పౌర్ణమి సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించే సంబరాలు మంగళవారం వైభవంగా ముగిశాయి. రెండో రోజు సోమవారం రాత్రి మొలకలు నోమే కార్యక్రమం అనంతరం బలిజపేట, కుమ్మరపేటలనుంచి చాందినీ బండ్లు ఊరేగింపుగా వచ్చి అమ్మవారి ఆలయం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణలు చేశాయి. మొలకలు పోసి మహిళలకు వారి మొలకల నైపుణ్యతను బట్టి టి.రెడ్డివారిపల్లికి చెందిన దేశిరెడ్డి లక్ష్మీనారాయణమ్మ, శివారెడ్డిల జ్ఞాపకార్థం వీరి కుటుంబీకులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు, కన్సొలేషన్ బహుమతుల కింద చీరలు పంపిణీ చేశారు. మంగళవారం ఉదయం అమ్మవారికి బోనాలు సమర్పించి, జంతుబలి ఇచ్చారు. సాయంత్రం ఎద్లబండ్ల మెరవణి చేపట్టారు. ఎస్ఐ నరసింహుడు ఆధ్వర్యంలో ఏఎస్ఐలు కృష్ణారెడ్డి, మస్తాన్, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ

తాడిమర్రి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డి.మధుసూదన్‌రెడ్డి సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేసిన సురేష్‌బాబు డీఐఈఓగా పదోన్నతిపై కర్నూలు వెళ్లారు.

అమడగూరు: శీతిరెడ్డిపల్లి సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా లక్ష్మీనరసింహులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి

నల్లచెరువు: కె పూలకుంటకు చెందిన మాజీ సర్పంచ్ అక్బర్ తండ్రి, వైఎస్సార్‌సీపీ నేత పెద్ద మదార్‌వలి (80) అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి, నాయకులు దశరథ నాయుడు, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ యూసుఫ్, పోరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తన్న, శ్రీధర్‌రెడ్డి, కె.శ్రీనివాసులు, గోవిందురెడ్డి, మహేశ్వరరెడ్డి, రామాంజనేయులు, రమణ, నవాజ్ ఖాన్ తదితరులు గ్రామానికి వెళ్లి మదార్‌వలి మృత దేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వ్యక్తికి గాయాలు

ఎన్పీకుంట: కదిరి మండలం తెల్లగుట్టపల్లికి చెందిన గంగాధర్ అనే వ్యక్తి మంగళవారం బత్తినగారిపల్లిలో విందు ముగించుకుని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఎన్పీకుంట సమీపంలోని మోరీల మిట్ట వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయమై అపస్మారకస్థితికి చేరుకున్న అతడిని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కానిస్టేబుల్ రమణ, హోంగార్డు మౌలాసాహెబ్ సంఘటనా స్థలానికి చేరుకుని గంగాధర్‌ను తమ వాహనంలోనే పీహెచ్‌సీకి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనంతరం కదిరి ఏరియా ఆస్పత్రికి పంపించారు.

కలశస్థాపన పూజలు


కలశ స్థాపన చేస్తున్న విద్యారణ్య భారతి స్వామీజీ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేశవనగర్‌లో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయం ప్రారంభోత్సవంతోపాటు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం కంచి పీఠాధిపతి విరూపాక్షి విద్యారణ్య భారతి స్వామీజీ పూజలు, కలశస్థాపన చేశారు. ఉదయం ఆవాహిత దేవతా హోమాలు, పురుష సూక్త పురశ్చరణ హోమం, ఉదక శాంతి అయ్యప్ప సహస్రనామార్చన హోమాలు, గోపుర, ధ్వజములకు స్నపనం, ప్రాసాదాధివాసనం, పూర్ణాహుతి, మంత్ర పుష్పం తదితర పూజలు చేశారు. సాయంత్రం జీవాదితత్వన్యాస, శాంతిక పౌష్టిక హోమాలు, శయ్యాధివాసం, పూర్ణాహుతి, వేదస్వస్తి హోమాలు నిర్వహించారు. మహా సుదర్శన హోమాన్ని వేదమంత్రాల నడుమ నిర్వహించారు. 14న బుధవారం శ్రీ అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు గురుస్వామి పీజే విజయ్‌కుమార్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

చెన్నేకొత్తపల్లి: మెగా డీఎస్సీ అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్థానిక బీసీ హాస్టల్ వార్డెన్ నరసింహమూర్తి మంగళవారం తెలిపారు. దరఖాస్తు ఫారంతోపాటు టెట్ మార్కుల జాబితా, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డుతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో వెనుకబడిన తరగతులు సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు 9640994055 నంబరులో సంప్రదించాలని సూచించారు.